Follow: @ANNTELUGU
31-08-2026
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 233 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఎస్ఐఆర్ సెకండ్ ఫేజ్ చాలా కీలకం

- ఒక్క ఓట్ కూడా పోకుండా జాగ్రత వహించాలి
- ఎస్ఐఆర్ ఫేజ్-2 కోర్ కమిటీ సమావేశంలో కంది శ్రీనివాస రెడ్డి సూచనలు

**ఆదిలాబాద్ మహా :** ఎస్ఐఆర్ సెకండ్ ఫేజ్ లో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత బీఎల్ ఏ2 లు, సూపర్వైజర్లు, కోఆర్డినేటర్లు, కౌన్సిలర్ గా పోటీ చేసిన అభ్యర్థులు, మండల ,పట్టణ , వార్డ్ అధ్యక్షులు అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకుల పై ఉందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ఫేజ్ 2 కోర్ కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ రెండవ ప్రక్రియలో 85వేల మందికి నోటీసులు

మిగతా 2వ పేజీలో


టాప్ న్యూస్



### యేషనాగుల కట్టమీద.. రికార్డులను దున్నేస్తున్న సాంగ్

- షేకవుతున్న సోషల్ మీడియా

03



### ఇరుముడి కలెక్షన్ల పూనకాలు

- 150కోట్లు.. 70లక్షలకు పైగా టికెట్లు
- రూ.150 కోట్ల రికార్డు షేర్‌తో తెలుగు సినిమా చరిత్రలో సంచలనంగా నిలిచిన 'ఇరుముడి'

02

### హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం



- ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల్లో నిర్మాణానికి సీఎం మెగా ప్లాన్
- డిసెంబరులో శంకుస్థాపనకు అవకాశం
- బీసీసీఐతో భాగస్వామ్యంపై కసరత్తు

02

# రేవంత్ సర్కార్ వెయ్యి రోజుల 'రైజింగ్'

- రైతు సంక్షేమం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు
- కొలువులు.. సంక్షేమం.. పెట్టుబడులు.. సంస్కరణలు
- వెయ్యి రోజుల పాలన.. 2047 లక్ష్యం
- తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక శక్తిగా మార్చే ప్రణాళిక

## తెలంగాణకు కొత్త దిశ

( మొదటి పేజీ తరువాయి )

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 1వ తేదీ నాటికి విజయవంతంగా 1000 రోజుల మైలురాయిని చేరుకుంది. ప్రజల ఆకాంక్షలను పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని, సంక్షేమం-అభివృద్ధి-సామాజిక న్యాయాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లిన వెయ్యి రోజుల ప్రజాపాలన తెలంగాణ ప్రగతిలో కొత్త అధ్యాయాన్ని నమోదు చేసింది. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్ష లబ్ధి చేకూర్చే పథకాల అమలుతో పాటు కొత్త చట్టాలు, కొత్త విధానాలు, కొత్త సంస్థలు, కీలక పరిపాలనా సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒకవైపు సంక్షేమ పథకాలతో పేదల కన్నీళ్లు తుడుస్తూనే, మరొకవైపు రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి అభివృద్ధి దిశగా ఉరకలెత్తిస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దార్శనికతకు ఈ వెయ్యి రోజుల పాలన సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. రైతు సంక్షేమం నుంచి మహిళా సాధికారత వరకు, విద్య, వైద్యం, సామాజిక న్యాయం నుంచి డిజిటల్ పాలన, పెట్టుబడులు, మౌలిక వసతుల దాకా..

మిగతా 2వ పేజీలో







# నాలాలను తెగనమ్ముతున్న ఇరిగేషన్ అధికారులు...!

## నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న వైనం...!

నాడెం చెరువు నాలాపై ఆగని అక్రమ నిర్మాణాలు...!



02

- నాలా మళ్లింపునకు 'డీఈఈ' ఎన్ఓసీ...!
- చట్టాన్ని ఖూనీ చేసిన ఇరిగేషన్ అధికారులు!
- ఇరిగేషన్ చట్టాలు, వాల్టా నిబంధనలకు పాతర..!"
- డీఈఈ అనుమతి ఇచ్చారు.. నాలా డైవర్షన్ చేసుకున్నాం" అని బాహాటంగా చెప్తున్న నిర్మాణదారుడు!
- తీవ్రస్థాయిలో మండిపడుతున్న కాలనీ వాసులు...!



### మేఘాలయలో మిత్రపక్షానికే బీజేపీ గాలం?

- యూడీపీకి చెందిన 9 మంది ఎమ్మెల్యేల ఫిరాయింపు ప్రచారం.
- అమిత్ షాతో భేటీతో మరింత వేడెక్కిన రాజకీయాలు.

02



## నేపాల్ విషాదం

788కు చేరిన మృతుల సంఖ్య

మొత్తం 2,500 మందికి పైగా గల్లంతు

02

### ప్రజల ఆకాంక్షలే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- రూ.131.61 కోట్లతో మధిరలో అభివృద్ధి పనులకు శ్రీకారం.
- సంక్షేమం, విద్య, వైద్యం, రహదారులకు భారీగా నిధులు.
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.

02





### రాయలసీమ పల్లెల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- రూ.8,022 కోట్లతో గ్రామాలు, అటవీ అభివృద్ధి
- 23 వేలకుపైగా రోడ్ల పనులకు రూ.4,523 కోట్లు
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

02



### జగన్‌పై విజయసాయి ఆరోపణలు దురదృష్టకరం


- వ్యక్తిగత కోసమే సాయిరెడ్డి వ్యాఖ్యలు.
- వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి.

02

### వైవిధ్యాన్ని గౌరవిస్తూనే ఏకత్వ భావనను కాపాడాలి

02

- 'ప్రపంచమంతా ఒకే కుటుంబం'.
- న్యూయార్క్ వేదికగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ సందేశం.





# నాలాలను తెగనమ్ముతున్న ఇరిగేషన్ అధికారులు...!

మహా, సిటీ బ్యూరో:
ప్రభుత్వ భూములను, సహజ వనరులను సంరక్షించాల్సిన రక్షకులే భక్షకులుగా మారితే ఇక సామాన్యుడికి దిక్కెవరు? చట్టాన్ని గౌరవించాల్సిన అధికారులే అక్రమార్కులకు అండగా నిలిస్తే వ్యవస్థ ఎటు పోతుంది? జోడిమెట్ల పరిధిలోని నాడెం చెరువు నాలా పై జరుగుతున్న అక్రమ నిర్మాణాలు అధికారుల నిలువెత్తు నిర్లక్ష్యానికి, లాలూచీకి సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు కేవలం నామమాత్రంగా నోటీసులిచ్చి చేతులు దులుపుకోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఒకవైపు నోటీసులు ఇచ్చామని అధికారులు చెప్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అక్రమ నిర్మాణాలు రాత్రింబవళ్లు నిరాటంకంగా కొనసాగుతుండడం అధికారుల నిలువెత్తు లాలూచీకి అద్దం పడుతోంది.

**చట్టాన్ని ఖూనీ చేసిన డీఈఈ ఎన్ఓసీ!.. నాలా మళ్లింపునకు అధికారుల లాలూచీ!***

తెలంగాణ ఇరిగేషన్ చట్టాలు, వాల్టా నిబంధనల ప్రకారం సహజ సిద్ధమైన నాలాలను, వాగుల ప్రవాహాన్ని ప్రైవేట్ వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం మళ్లించడానికి ఇరిగేషన్ అధికారులకు ఎలాంటి చట్టపరమైన అధికారం లేదు. కానీ, జోడిమెట్లలో అక్రమార్కులకు ఇరిగేషన్ డీఈఈ ఆంజనేయులు అయాచితంగా రక్షణ కవచం తొడిగారు. నాలా ప్రవాహాన్ని మళ్లించుకోవచ్చంటూ తన పరిధి దాటి డీఈఈ ఎన్ఓసీ జారీ చేయడం వెనుక లక్షల రూపాయల ముడుపుల కథ దాగి ఉందని బాధితులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు."డీఈఈ అనుమతి ఇచ్చారు.. మేము నాలా డైవర్షన్ చేసుకున్నాం" అని నిర్మాణదారుడు బాహాటంగా చెప్తుండడం ఇక్కడి ఇరిగేషన్ అధికారుల లాలూచీకి నిలువెత్తు సాక్ష్యం. ఇరిగేషన్ చట్టాల ప్రకారం ప్రకృతి సిద్ధమైన నీటి ప్రవాహాల దిశను మార్చడం శిక్షార్హమైన నేరం. ఉన్నతాధికారుల సాంకేతిక కమిటీ లేదా ప్రభుత్వ ఉన్నత... స్థాయి నిర్ణయం లేకుండా, కేవలం ఒక ప్రైవేట్ వెంచర్ కోసం డీఈఈ ఇచ్చిన అనుమతులు చట్టం ముందు అస్సలు చెల్లవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఉన్నతాధికారుల కమిటీకి మాత్రమే ఉండే అధికారాలను ఒక డీఈఈ ఏ ప్రాతిపదికన బిల్డర్‌కు ధారాదత్తం చేశారని, ఈ అక్రమ ఎన్ఓసీపై తక్షణమే క్రిమినల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

**జీవో 168, హెచ్ఎండీఏ బఫర్ జోన్ నిబంధనల ఉల్లంఘన!***

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బిల్డింగ్ రూల్స్ జీవో ఎం/ఎస్ నెం. 168, హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం నాలాలు, వాగుల పరిరక్షణకు కఠినమైన రూల్స్ ఉన్నాయి. నాలా వెడల్పును బట్టి దాని ఇరువైపులా కనీసం 9 మీటర్ల (లేదా అంతకంటే ఎక్కువ) పరిధిని బఫర్ జోన్‌గా వదిలిపెట్టాలి. ఈ బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి శాశ్వత లేదా తాత్కాలిక కాంక్రీట్ కట్టడాలు చేపట్టకూడదు. కానీ జోడిమెట్ల నాడెం నాలా విషయంలో ఈ చట్టాలు పూర్తిగా కాగితాలకే పరిమితమయ్యాయి. నాలా నడి బొడ్డున నాలా గర్భాన్ని మింగేస్తూ, బఫర్ జోన్‌ను పూర్తిగా ఆక్రమించి ఇరుకైన పిల్లర్లు లేపుతున్నా స్థానిక ఏఈఈ, డీఈఈలు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక లక్షలాది రూపాయల లాలూచీ దాగి ఉందని స్పష్టమవుతోందని స్థానికులు వాపోతున్నారు . జోడిమెట్ల నాడెం చెరువు నాలా కబ్జా వల్ల ప్రధానంగా హిమగిరి కాలనీ, డాక్టర్స్ కాలనీ, కాకతీయ కాలనీ, అన్నానగర్ కాలనీ, విజయసాయి కాలనీ, పోచారం కాలనీ, ఎమ్ఎల్ఆర్ కాలనీ, అరుంధతి కాలనీ, వెంకటేశ్వర కాలనీల ఉనికి తీవ్ర ప్రమాదంలో పడిందని, చిన్న వర్షానికే ఈ కాలనీలన్నీ జలమయం అవుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**న్యాయస్థానాల మైలురాయి తీర్పుల ఉల్లంఘన: అధికారుల మెడకు కోర్టు ధిక్కరణ ముప్పు!***

జోడిమెట్ల నాడెం నాలా వ్యవహారంలో స్థానిక ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రైవేట్ బిల్డర్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ, గతంలో దేశ అత్యున్నత న్యాయస్థానంతో పాటు రాష్ట్ర హైకోర్టులు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను, స్పష్టమైన ఉత్తర్వులను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**జగ్‌పాల్ సింగ్ అండ్ అదర్స్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో సుప్రీంకోర్టు సంచలన ఆర్డర్:**

ఈ కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిస్తూ.. దేశంలో సహజసిద్ధమైన చెరువులు, నాలాలు, కుంటలు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన ఉమ్మడి భూములను ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాల కోసం మార్చకూడదని తేల్చి చెప్పింది. అక్రమ ఆక్రమణదారులు ఎంతటి రాజకీయ, ఆర్థిక బలవంతులైనా సరే, వారు భారీ ఖర్చుతో శాశ్వత కాంక్రీట్ కట్టడాలు కట్టినప్పటికీ, వాటిని తక్షణమే కూల్చివేసి తిరిగి ఆ భూమిని పూర్వ రూపంలోకి తేవాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

**శ్రీ చంద్రమోహన్ రెడ్డి సోమిరెడ్డి వర్సెస్ స్టేట్ ఆఫ్ తెలంగాణ - 2026) జలవార్‌ఖాన్ చెరువు కేసు:**

అధికారుల అవినీతిపై మండిపడుతూ నేరుగా క్రైమ్ బ్రాంచ్/క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించింది.

**(శ్రీమతి సుకైనా ఫాతిమా వర్సెస్ స్టేట్ ఆఫ్ తెలంగాణ- 2024) మూసి నాలా పరివాహక కేసు:**

నాలాలు, వాగుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధులను నిర్ధారించే సర్వేలను ప్రైవేట్ వ్యక్తులు లేదా అక్రమ ఆక్రమణదారులు అడ్డుకోకూడదని హైకోర్టు ఖచ్చితమైన ఆర్డర్ ఇచ్చింది.

కోర్టుల నుంచి ఇన్ని స్పష్టమైన రూలింగ్స్ ఉన్నప్పటికీ, జోడిమెట్ల ఇరిగేషన్ అధికారులు డీఈఈ పరిధి దాటి నాలా మళ్లింపునకు ఎన్ఓసీ ఇవ్వడం నేరుగా కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని చట్టపరమైన నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారులపై బాధితులు, కాలనీ అధ్యక్షుల ఆగ్రహం !**

***ఇరిగేషన్ కమిషనర్‌కు సమగ్ర నివేదిక సమర్పిస్తాం !**నాడెం చెరువు నాలా ఉనికిని ప్రమాదంలో పడేసిన క్షేత్రస్థాయి అధికారుల అవినీతి లీలలపై కాలనీ ప్రతినిధులు ఇరిగేషన్ కమిషనర్‌కు సమగ్ర నివేదిక ఇస్తామని హెచ్చరించారు. బాధ్యత గల స్థానాల్లో ఉండి అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు, వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేయనున్నారు. ఈ నివేదికలో గతంలో జరిగిన బదిలీల వివరాలను, బిల్డర్ల నుంచి అధికారులు దండిగా వసూలు చేసిన లీలలను కూడా స్పష్టమైన ఆధారాలతో పాటు పొందుపరిచినట్లు వెల్లడించారు.



**ఉమామహేశ్వర్ గౌడ్ (కాకతీయ కాలనీ ప్రతినిధి)**
"చిన్న వర్షానికే ఇక్కడ కాలనీలన్నీ జలమయం అవుతున్నాయి. రేపు భారీ వర్షాలు వస్తే మా ఇళ్ల పరిస్థితి ఏంటి? అధికారుల నిర్లక్ష్యానికి, స్వార్థానికి అమాయక ప్రజలు బలికావాలా? వాల్టా చట్టం, జీవో 168 ప్రకారం బఫర్ జోన్ వదిలిపెట్టకుండా అక్రమ కట్టడాలు కడుతుంటే కళ్లు మూసుకున్న ఇరిగేషన్ అధికారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

**ఇరిగేషన్ అధికారుల మౌనం వెనుక మర్మమేంటి..**

ప్రజల ప్రాణాలు పోయాకే మేల్కొంటారా? నాడెం చెరువు నాలా గర్భంలోనే అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయంటూ స్పష్టమైన ఆధారాలు లభిస్తున్నా, రాత్రింబవళ్లు పనులు జరుగుతున్నాయని స్థానికులు మొత్తుకుంటున్నా.. సంబంధిత అధికారులు మాత్రం మౌనం వీడకపోవడం పరిస్థితి తీవ్రతను, వారి వెనకునఉన్న లాలూచీని మరింత స్పష్టం చేస్తోంది. ఏఈఈ మౌనిక నామమాత్రపు పరిశీలన చేసి చేతులు దులుపుకున్నారే తప్ప, నిర్మాణాలను ఆపలేకపోయారు. దీంతో "ప్రజల ప్రాణాలా ముఖ్యమా..? లేక అక్రమ నిర్మాణాల వెనుక అందే ముడుపులు ముఖ్యమా..?" అనే ప్రశ్న ఇప్పుడు జోడిమెట్ల ప్రాంత ప్రజల నోట మారుమోగుతోంది.

***విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరపాలి!**

నిబంధనలను తుంగలో తొక్కి, వాల్టా చట్టం, జీవో 168ని తుంగలో తొక్కేలా అక్రమ నిర్మాణాలకు బాటలు వేసిన హెచ్ఎండీఏ అధికారుల పాత్రపై తక్షణమే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేత ఉన్నత స్థాయి విచారణ జరిపించాలి. 2026 నాటి తాజా జలవార్‌ఖాన్ చెరువు కేసు తీర్పును బేస్ చేసుకుని, ఇరిగేషన్ అధికారులతో కలిసి తప్పుడు నివేదికలు సృష్టించి నాలా బఫర్ జోన్ పరిధిలో జారీ చేసిన హెచ్ఎండీఏ అనుమతులను తక్షణమే రద్దు చేయాలి.

అధికారులు ఇప్పటికైనా తమ కుంభకర్ణ నిద్ర వీడి తక్షణమే స్పందించాలి. నాడెం చెరువు నాలా అసలు హద్దులను అధికారికంగా గుర్తించి, ఆక్రమణలపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. అలా కాకుండా ఇదే మౌనాన్ని కొనసాగిస్తే.. రేపు మరో వరద విపత్తు సంభవించి కాలనీలు మునిగిపోయి, ప్రాణ నష్టం జరిగితే దానికి ఈ అవినీతి అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు, బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విపత్తు సంభవించిన తర్వాత మొసలి కన్నీరు కార్చడం కాదు.. ఇప్పుడే అక్రమ కట్టడాలను కూల్చివేసి నాలాను రక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఇ. రవికుమార్ (డాక్టర్స్ కాలనీ ప్రెసిడెంట్)**

"ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులు నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతూ బిల్డర్లకు పనులు పూర్తి చేసుకోవడానికి లోపాయికారీగా సమయం ఇస్తున్నారు. హెచ్ఎండీఏ జారీ చేసిన తప్పుడు అనుమతులను తక్షణమే రద్దు చేసి, నాలాను పూర్వ రూపానికి తీసుకురావాలి. రేపు ఏ ముంపు ముంచుకొచ్చినా దానికి డీఈఈ, ఏఈఈలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**జి. నాగరాజు (డాక్టర్స్ కాలనీ ప్రతినిధి)**


"ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిన ఇరిగేషన్ అధికారులు పూర్తిగా కబ్జాదారులకు ఏజెంట్లుగా మారిపోయారు. కాలనీ వాసుల రక్షణ కంటే వారికి అందుతున్న ముడుపులే ఎక్కువయ్యాయి. విచారణ జరిపి అక్రమ నిర్మాణాలను కూల్చేవరకు మేము వెనకడుగు వేసేది లేదు.



**ధర్నాకు దిగుతాం.. హెచ్చరించిన పోచారం మాజీ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ కొండల్ రెడ్డి :**




నాడెం చెరువు నాలా పరిరక్షణకై స్థానిక ప్రజల పక్షాన పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి రంగంలోకి దిగారు. నాలాపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయకపోతే ఊరుకునేది లేదని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. కబ్జాదారుల వెనుక ఎంతటి రాజకీయ హస్తం ఉన్నా సరే ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. లేనిపక్షంలో బాధ్యులైన ఇరిగేషన్ అధికారుల కార్యాలయం ముందు కాలనీ వాసులందరితో కలిసి భారీ ఎత్తున ధర్నాకు దిగుతామని, అక్రమాలను అడ్డుకునే వరకు పోరాటం ఆపేది లేదని ఆయన అల్టిమేటం జారీ చేశారు.

**ఆకిటి కృష్ణారెడ్డి (హిమగిరి కాలనీ ప్రెసిడెంట్)**

"మా కళ్లముందే నాడెం చెరువు నాలాను మింగేస్తుంటే డీఈఈ అంజనేయులు నోటీసుల పేరుతో నాటకాలాడుతూ కాలయాపన చేయడం దారుణం. ఇరిగేషన్ అధికారుల పరోక్ష అండ చూసుకునే బిల్డర్లు యథేచ్ఛగా రెచ్చిపోతున్నారు. జగ్‌పాల్ సింగ్ కేసులో 2011లో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక ఆర్డర్ వీరికి వర్తించదా? తక్షణమే ఉన్నతాధికారులు దీనిపై స్పందించి చర్యలు తీసుకోకపోతే ఇరిగేషన్ అధికారుల అవినీతి బండారాన్ని ఆధారాలతో సహా బట్టబయలు చేస్తాం.

**"రమేష్ (ఎమ్ఎల్ఆర్ కాలనీ ప్రతినిధి)**
"నిబంధనల ప్రకారం నాలాల పక్కన ఎలాంటి కాంక్రీట్ కట్టడాలు చేపట్టకూడదు. కానీ ఇక్కడ రూల్స్ అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. బిల్డర్లు ఇష్టారాజ్యంగా పిల్లర్లు వేసి అంతస్థుల మీద అంతస్థులు లేపుతున్నా స్థానిక అధికారుల మౌనం వెనుక కోట్ల రూపాయల లాలూచీ దాగి ఉంది.

**ఎమ్. వెంకటేష్ (విజయసాయి కాలనీ ప్రతినిధి):**
"నాడెం చెరువు నాలాని మింగి నిబంధనలను ఇరిగేషన్ అధికారులే స్వయంగా తుంగలో తొక్కారు. నాలా ప్రవాహాన్ని ప్రకృతి విరుద్ధంగా మార్చడం వల్ల చుట్టుపక్కల కాలనీలు మునగడమే కాకుండా భూగర్భ జలాలు కూడా కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. అధికారులను సస్పెండ్ చేసే వరకు మా పోరాటం ఆపే ప్రసక్తే లేదు.

**కె. దయాకర్ (హిమగిరి కాలనీ ప్రతినిధి)**

"అక్రమ కట్టడాల యజమానుల నుంచి నెలవారీగా భారీ ఎత్తున ముడుపులు అందుతుండడం వల్లే ఇక్కడి అధికారులు డమ్మీలుగా మారిపోయారు. ప్రభుత్వ ఆస్తులను, ప్రజా హక్కులను కాపాడాల్సిన వారే ఇలా కబ్జాదారులతో చేతులు కలిపి లాలూచీ పడడం సిగ్గుచేటు. ఈ అక్రమ వసూళ్ల పర్వంపై ఏసీబీతో పాటు ఉన్నత స్థాయి విచారణ జరిపించి దోషులను జైలుకు పంపాల్సిందే.

---



# యేషనాగుల కట్టమీద..

**రికార్డులను దున్నేస్తున్న సాంగ్ షేకవుతున్న సోషల్ మీడియా**

**హైదరాబాద్, మహా :** ది పారడైజ్ నుంచి విడుదలైన (యేష నాగుల కట్ట మీద.. ఏసిన ఉయ్యాల సాంగ్ రికార్డుల దుమ్ము దులిపేస్తుంది. విడుదలైన 24 గంటల్లోపే 20 మిలియన్లకు పైగా వ్యూస్ అందుకుని యూ ట్యూబ్ ట్రెండింగ్‌లో నెంబర్ వన్‌గా కొనసాగుతుంది.. సాంగ్ విడుదలైన క్షణం నుండి రికార్డుల వేట మొదలుకాగా, తెలుగురాష్ట్రాల్లో ఎక్కడ చూసిన యేషనాగుల వైబ్ తో ఊగిపోతోంది. ఆల్ టైం సాంగ్స్ లిస్ట్ లో దూసుకుపోతోంది. పాత రికార్డులన్నింటినీ ఏషనాగుల ఊచకోత కోసేస్తోంది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ హైవోల్టేజ్ ఫోక్ మాస్ ఆంథమ్ మొదటి బీట్ నుంచే ఆకట్టుకుంటోంది. కాసర్ల శ్యామ్ రాసిన పక్కా లోకల్ తెలంగాణ ఫోక్ లిరిక్స్ 'ఏష నాగుల కట్ట మీద ఏసిన ఉయ్యాలా.. మనం ఊగుదామే బాలా' పాటకు ప్రాణంగా నిలిచాయి. ప్రభా బంగారిగళ్ళ, అద్దుల జంగిరెడ్డి తమ పవర్‌ఫుల్ జానపద గాత్రంతో పాటను మరో లెవెల్‌కు తీసుకెళ్లారు. వీడియోలో నాని తన ఊరమాస్ రా లుక్‌లో కనిపిస్తూ ఎనర్జిటిక్ మూమెంట్స్‌తో దుమ్ము రేపగా, కీర్తి సురేష్ చేసిన స్పెషల్ డ్యాన్స్ అండ్ గ్లామరస్ ఫోక్ స్టెప్పులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ పాట ఓ వైపు సామాజిక మాధ్యమాలను దున్నేస్తుంటే.. మరోవైపు ట్రోలింగ్ కూడా అదే స్థాయిలో ఉంది. తాజా పాటకు సమకూర్చిన నృత్య రీతులు ఏమాత్రం సెట్ అవ్వలేదని దుయ్య బడుతున్నారు. అక్కడ వచ్చే పాటకు ఆ డ్యాన్స్ మూవ్‌మెంట్స్‌కి సంబంధమే లేదని అసలు పాటకు తగ్గట్లు డ్యాన్స్ బీట్స్ లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర హీరోల డ్యాన్స్ మూమెంట్స్ పెట్టి కూడా అభిమానులు ఎంజాయ్ చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ సెకండ్ ఫేజ్ చాలా కీలకం

( మొదటి పేజీ తరువాయి )

అందనున్నాయన్నారు.అర్హత కలిగిన ఏ ఒక్కరి ఓటు కూడా పోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బూత్ ల వారీగా నోటీసులు అందుకున్న వారి వివరాలు సేకరించి తగిన ధృవపత్రాలు ఎన్నికల కమీషన్ కు సమర్పించి ఓటు కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. తాను ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణం లోని అనామలిస్ ఓట్ల పై దృష్టి సారించాలని సూచించారు. అర్హుల ఓట్లు ఎట్టి పరిస్థితులలో పోకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎన్నికలలలో డబ్బే ప్రధానం కాదన్నారు. మన మంచి మాట కూడా ప్రభావం చూపుతుందన్నారు. ఆదిలాబాద్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీజేపీ వాళ్లకు ఎలా సమాధానం చెప్పాలో తనకు తెలుసన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరక్షరాస్యులకు నోటీసులొస్తే దగ్గరుండి ధృపపత్రాలు సమర్పించి ఓటు రక్షించాలన్నారు.అలాగే డ్రాఫ్ట్ జాబితాలో అర్హుడిగా భావించిన వారి పేర్లు లేకపోతే తిరిగి నమోదుకు ప్రయత్నించాలన్నారు. ముఖ్యంగా మైనారిటీలు,పేదలు, నిరక్షరాస్యులు తమ ఓటు హక్కును కోల్పోకుండా పార్టీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ,ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్ సంతోష్ రావు, మాజీ డీసీసీబీ చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ షాహిద్ అలీ, లీగల్ సెల్ చైర్మన్ మంగేష్, నాయకులు గుడిపెల్లి నగేష్, మెహబూబ్ , సుధాకర్ గౌడ్, శాంతన్ రావు, అన్సార్, అడ్డి రుకేష్ రెడ్డి , రాందాస్ నాక్లే ,సోనియా మంథని, శ్రీలేఖ, జ్యోతి, షబానా ,బోనగిరి సంటెన్న, ఏనుగు రవీందర్ రెడ్డి, అల్చేట్టి నాగన్న, మండల అధ్యక్షులు వెంకన్న యాదవ్, బత్తుల శ్రీనివాస్, బాపూరావు, జగదీష్ రెడ్డి, రూప్ రావ్, సర్పంచ్లు వేణుగోపాల్, వామన్, దంతెల వినోద్ ఉప సర్పంచ్ గౌతమ్ రెడ్డి, అతిక్ , రఫిక్, చంద్రకాంత్, శంకర్, పొట్ల అశోక్, ప్రభాకర్, ఆశన్న, చందు, షకీల్, బండి సంజయ్, బండి సుదర్శన్ విశాల్, హంజా, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ఇరుముడి కలెక్షన్ల పూనకాలు

**150కోట్లు..70లక్షలకు పైగా టికెట్లు**




**హైదరాబాద్, మహా** ఇరుముడి.. కలెక్షన్లు, రికార్డులు ట్రేడ్ పండితులనే ఆశ్చర్యపరుస్తున్నాయి. భక్తి పవర్ చూపిస్తున్నాయి. జనం కేవలం సినిమా చూడటం లేదు... ఒక ఉత్సాహంతో, ఉద్వేగంతో థియేటర్ల వైపు పరిగెడుతున్నారు. 'ఇరుముడి' చిత్రం ప్రదర్శిస్తున్న భక్తి, ఆవేశం ఇప్పుడు ఒక సామూహిక సంచలనంగా మారి, బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో ఏకంగా 70 లక్షలకు పైగా టిక్కెట్లను విక్రయించేలా చేసింది. రెండవ వారంలోనూ డిజిటల్ స్క్రీన్ల నుంచి థియేటర్ల దాకా ఈ సినిమా సృష్టిస్తున్న దావానాలాన్ని ఏ శక్తి కూడా ఆపలేకపోతోంది. 150కోట్లకు రికార్డు షేర్ కలెక్ట్ చేసిన సినిమా తెలుగుసినిమా చరిత్రలోనే ఓ సంచలనంగా మారింది.

# వైవిధ్యాన్ని గౌరవిస్తూనే ఏకత్వ భావనను కాపాడాలి

**న్యూయార్క్, మహా :** భాషలు, మతాలు, ఆచారాలు, జీవన విధానాలు వేరైనా మానవాళి అంతా అంతర్లీనంగా ఒక్కటేనని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. ప్రపంచంలో కనిపించే వైవిధ్యాన్ని తొలగించడం ఏకత్వం కాదని, భిన్నత్వాన్ని అంగీకరిస్తూ పరస్పర గౌరవంతో జీవించడమే భారతీయ సంస్కృతి ప్రపంచానికి అందిస్తున్న అసలైన సందేశమని చెప్పారు. అమెరికాలోని న్యూయార్క్ మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో నిర్వహించిన 'యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్'లో భారతీయ అమెరికన్ సమాజాన్ని ఉద్దేశించి ఆయన కీలక ప్రసంగం చేశారు.

'వసుధైవ కుటుంబకం' అంటే కేవలం ఆకర్షణీయమైన నినాదం కాదని, మానవ జీవన విధానానికి దిశానిర్దేశం చేసే భారతీయ తాత్విక భావన అని మోహన్ భాగవత్ వివరించారు. మనిషి తన కుటుంబం, సమాజం, దేశంతో పాటు ప్రపంచం పట్ల కూడా బాధ్యతతో వ్యవహరించినప్పుడే విశ్వమానవ ఏకత్వం సాకారమవుతుందని తెలిపారు. ప్రపంచంలోని ప్రతి వ్యక్తి భౌతికంగా, మానసికంగా, అభిరుచుల పరంగా మరొకరికి భిన్నంగా ఉంటాడని, అయితే ఆ భిన్నత్వం వెనుక మానవత్వమనే ఉమ్మడి జీవధార ప్రవహిస్తోందని పేర్కొన్నారు.

వైవిధ్యాన్ని కేవలం సహించడమే కాకుండా గౌరవించాలని, స్వీకరించాలని, ఆనందంగా వేడుక చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అదే సమయంలో మనమంతా ఒకటేననే అంతర్గత భావనను మరచిపోకూడదన్నారు. భాషలు, మతాలు, దేశాలు, సంప్రదాయాల కారణంగా మనుషులు వేర్వేరుగా కనిపించినప్పటికీ, ఆకలి, ఆనందం, బాధ, ఆశలు, ఆత్మగౌరవం వంటి మానవ అనుభూతులు అందరిలోనూ ఒకేలా ఉంటాయని వివరించారు.

# మేఘాలయలో మిత్రపక్షానికే బీజేపీ గాలం?



**షిల్లాంగ్, మహా:** మేఘాలయ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. అధికార నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) నేతృత్వంలోని కూటమిలో భాగస్వామిగా ఉన్న యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ (యూడీపీ)కి చెందిన పలువురు ఎమ్మెల్యేలు భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది. యూడీపీకి చెందిన తొమ్మిది మంది శాసనసభ్యులు పార్టీ మారే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో కూటమి రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. 60 మంది సభ్యులున్న మేఘాలయ అసెంబ్లీలో యూడీపీకి ప్రస్తుతం 12 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి ఇద్దరు సభ్యులున్నారు. యూడీపీ నుంచి కనీసం ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఒకేసారి బీజేపీలో విలీనమైతే.. మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల నిబంధనను అందుకునే అవకాశం ఉంటుంది. అలా జరిగితే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి రాకుండా సమూహ విలీనం సాధ్యమవుతుందన్నది రాజకీయ వర్గాల అంచనా. ఫలితంగా అసెంబ్లీలో బీజేపీ బలం రెండంకెలకు చేరే అవకాశం ఉంటుంది. యూడీపీలో కొంతకాలంగా అసంతృప్తి పెరుగుతోందన్న ప్రచారం ఈ పరిణామాలకు నేపథ్యంగా నిలిచింది. ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మాకు సన్నిహితుడిగా భావించే యూడీపీ అధ్యక్షుడు మెట్‌బా లింగ్డో నాయకత్వంపై కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీలో తమకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని భావిస్తున్న కొందరు శాసనసభ్యులు ప్రత్యామ్నాయ రాజకీయ మార్గాలను అన్వేషిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ఊహాగానాలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో యూడీపీ ఎమ్మెల్యేల భేటీ మరింత ఆజ్యం పోసింది. ఇటీవల యూడీపీకి చెందిన పలువురు శాసనసభ్యులు అమిత్ షాను కలవడంతో వారు బీజేపీ వైపు చూస్తున్నారన్న ప్రచారం బలపడింది. అయితే ఈ భేటీకి రాజకీయ ఫిరాయింపులతో ఎలాంటి సంబంధం లేదని యూడీపీ వర్గాలు స్పష్టం చేశాయి. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ), రాష్ట్రానికి సంబంధించిన ఇతర అంశాలపై చర్చించేందుకే కేంద్ర హోంమంత్రిని కలిసినట్లు పార్టీ వివరణ ఇచ్చింది. మేఘాలయలో బీజేపీ, యూడీపీ రెండూ అధికార ఎన్‌పీపీ నేతృత్వంలోని కూటమిలో భాగస్వాములు కావడం తాజా పరిణామానికి మరింత రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తోంది. సాధారణంగా ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ఆకర్షించడం ద్వారా బలాన్ని పెంచుకునే రాజకీయ వ్యూహాలు కనిపిస్తాయి. కానీ ఇక్కడ అధికార కూటమిలోనే ఉన్న మిత్రపక్ష ఎమ్మెల్యేలు బీజేపీ వైపు వెళ్లే అవకాశం ఉందన్న ప్రచారం తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. యూడీపీ నుంచి ఎనిమిది మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరితే పరిస్థితి గణనీయంగా మారనుంది. ప్రస్తుతం ఇద్దరు ఎమ్మెల్యేలతో ఉన్న బీజేపీ బలం ఏకంగా పది మందికి చేరే అవకాశం ఉంటుంది. ఇది అసెంబ్లీలో పార్టీ రాజకీయ ప్రాధాన్యాన్ని గణనీయంగా పెంచుతుంది. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీకి మంత్రివర్గంలో మరిన్ని పదవులు కేటాయించాలనే డిమాండ్ కూడా అప్పుడే తెరపైకి వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ప్రస్తుతానికి యూడీపీ ఎమ్మెల్యేల ఫిరాయింపు విషయం అధికారికంగా ధ్రువీకరించబడలేదు. తొమ్మిది మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరుతున్నారన్న వార్తలు ప్రధానంగా రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలపైనే ఆధారపడి ఉన్నాయి. ఎమ్మెల్యేలు స్వయంగా తమ నిర్ణయాన్ని ప్రకటించే వరకు దీనిని నిర్ధారిత రాజకీయ పరిణామంగా పరిగణించడం సాధ్యం కాదు. యూడీపీ కూడా బీజేపీలో విలీనం అవుతున్నట్లు అధికారికంగా ప్రకటించలేదు. మేఘాలయ రాజకీయాల్లో సంఖ్యాబలం అత్యంత కీలకం. చిన్న రాష్ట్ర అసెంబ్లీలో కొన్ని ఎమ్మెల్యేల నిర్ణయం కూడా ప్రభుత్వ కూటమి సమీకరణాలను మార్చగలదు. అందుకే యూడీపీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఒకేసారి పార్టీ మారితే దాని ప్రభావం కేవలం బీజేపీ బలం పెరగడానికే పరిమితం కాకుండా ఎన్‌పీపీతో ఉన్న కూటమి అంతర్గత సమీకరణాలపైనా పడే అవకాశం ఉంది. మరోవైపు యూడీపీ నాయకత్వం ఈ ప్రచారాన్ని ఎలా ఎదుర్కొంటుందన్నది కూడా కీలకంగా మారింది. ఎమ్మెల్యేలలో అసంతృప్తి నిజమైతే దాన్ని చక్కదిద్దేందుకు పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అసంతృప్త నేతలతో చర్చలు జరిపి వారిని పార్టీలోనే కొనసాగించే ప్రయత్నం చేయవచ్చు. అదే సమయంలో బీజేపీతో సంప్రదింపులు జరిగాయన్న అనుమానాలు కొనసాగితే కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య విశ్వాసంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. బీజేపీకి మాత్రం ఈ పరిణామం ఈశాన్య భారతదేశంలో తన రాజకీయ విస్తరణకు మరో అవకాశంగా మారవచ్చు. ఇప్పటికే ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీ తన సంస్థాగత బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. మేఘాలయలో యూడీపీ ఎమ్మెల్యేల మద్దతు లభిస్తే అసెంబ్లీలో బీజేపీ స్వతంత్ర రాజకీయ బలం గణనీయంగా పెరుగుతుంది. భవిష్యత్ ఎన్నికల దృష్ట్యా కూడా ఇది పార్టీకి వ్యూహాత్మక ప్రయోజనాన్ని కలిగించే అవకాశం ఉంది. అయితే యూడీపీ ఎమ్మెల్యేల సమూహ విలీనం జరిగితేనే ఈ పరిణామం ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి రక్షణ పొందుతుందన్న అంశం కీలకం. వ్యక్తిగతంగా ఎమ్మెల్యేలు పార్టీ మారితే అనర్హత వేటు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల మూడింట రెండొంతుల సభ్యుల మద్దతుతో సమూహంగా విలీనం చేయాలన్న వ్యూహం ఉంటేనే అది చట్టపరంగా నిలబడే అవకాశం ఉంటుంది. ఇదే కారణంగా యూడీపీకి చెందిన కనీసం ఎనిమిది మంది ఎమ్మెల్యేల సంఖ్య ప్రస్తుత చర్చల్లో కీలకంగా మారింది.

# వెయ్యి రోజుల పాలనలో సాధించిన విజయాలు

**( మొదటి పేజీ తరువాయి )**

ప్రభుత్వం చేపట్టిన ప్రతి అడుగు రాష్ట్ర భవిష్యత్ ముఖచిత్రాన్ని మార్చేస్తోంది. వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు, విద్య నుంచి వైద్యం వరకు, మహిళా సాధికారత నుంచి యువత ఉపాధి వరకు, సామాజిక న్యాయం నుంచి డిజిటల్ పాలన వరకు ప్రతి రంగంలో కొత్త నిర్ణయాలు తీసుకుంది. భారీ పెట్టుబడులను ఆకర్షించడం, ఉద్యోగ అవకాశాలను విస్తరించడం, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలకు బాటలు వేయడం, భవిష్యత్తు తెలంగాణకు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించింది.

1. 202526లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిక; దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే దాదాపు 91 శాతం అధికం.
2. రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ; 25 లక్షలకుపైగా రైతు కుటుంబాలకు రుణభారం నుంచి విముక్తి.
3. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయం; ఒకే విడతలో 9 రోజుల్లో దాదాపు రూ.9 వేల కోట్ల జమ.
4. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అమలు.
5. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, రైతు బీమా, పంట నష్టపరిహారంతో రైతులకు భరోసా.
6. 32 నెలల లెక్కల ప్రకారం వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1.68 లక్షల కోట్ల వ్యయం.
7. వరి సాగు, ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి దేశంలో నంబర్-1గా తెలంగాణ.
8. గత యాసంగిలో 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు; 13.37 లక్షల రైతులకు రూ.18,929 కోట్ల చెల్లింపు.
9. రెండు సీజన్లలో 1.47 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు; రైతులకు రూ.35,077 కోట్ల చెల్లింపు.
10. తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్ విస్తరణ; ఫిలిప్పీన్స్‌కు 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతికి ఒప్పందం.
11. ఇందిరా సౌర గిరిజల వికాసం కింద 2.10 లక్షల గిరిజన రైతులకు ప్రయోజనం కల్పిస్తూ 6 లక్షల ఎకరాల పోడు భూములకు సాగునీటి లక్ష్యంతో రూ.12,600 కోట్ల కార్యక్రమం.
12. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ; తుమ్మిడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం.
13. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం; 335 కోట్లకుపైగా ఉచిత ప్రయాణాలు, దాదాపు రూ.11 వేల కోట్ల ప్రయాణ వ్యయం ఆదా.
14. గృహజ్యోతి కింద 53 లక్షలకుపైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు; 10 కోట్లకుపైగా జీరో బిల్లులు.
15. దాదాపు 43 లక్షల కుటుంబాలకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్.
16. కల్యాణలక్ష్మి ద్వారా 1.68 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.4,709 కోట్ల సహాయం.
17. 4.54 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజీ; రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ.
18. మహిళా సంఘాలకు పాఠశాల యూనిఫాంలు, చీరల తయారీ, పెట్రోలు బంకుల నిర్వహణ, ఆర్టీసీ బస్సుల యాజమాన్యం వంటి ఆదాయ వనరుల కల్పన.
19. 15 లక్షలకుపైగా కొత్త రేషన్ కార్డుల జారీ.
20. కొత్త రేషన్ కార్డులు, సభ్యుల చేరికల ద్వారా లక్షలాది మందిని అదనంగా ఆహార భద్రత పరిధిలోకి తీసుకురావడం.
21. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం.
22. దాదాపు 3.38 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార భద్రత.
23. రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ; ప్రజా పంపిణీ వ్యవస్థలో కొత్త విధానానికి శ్రీకారం.
24. తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం; ఒక్కో అర్హ కుటుంబానికి రూ.5 లక్షల సహాయం.
25. హైదరాబాద్ క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణానికి నిర్ణయం.
26. 43.01 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు; డిసెంబర్ 2023 నుంచి జూలై 2026 వరకు రూ.30,089 కోట్ల వ్యయం.
27. సామాజిక భద్రతను మరింత విస్తరిస్తూ కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు.
28. రాష్ట్రవ్యాప్తంగా 1.12 కోట్లకుపైగా కుటుంబాలను కవర్ చేస్తూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే పూర్తి.
29. సర్వే ఆధారంగా కులాల వారీ సామాజిక, ఆర్థిక స్థితిగతుల వెల్లడి.
30. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం 59 ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా వర్గీకరణ.
31. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేసిన దేశంలోని తొలి రాష్ట్రంగా తెలంగాణ.
32. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు శాసనసభ ఆమోదం; కేంద్రానికి పంపింపు.
33. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర మొత్తం వ్యయంలో 12.4 శాతం కేటాయింపు.
34. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణ; దాదాపు కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం.
35. నైపుణ్యం లేని కార్మికులకు రూ.16 వేలు, సెమీ స్కిల్డ్‌కు రూ.17 వేలు, స్కిల్డ్‌కు రూ.18,500, హైలీ స్కిల్డ్‌కు రూ.20 వేల కనీస నెలవారీ వేతనం.
36. గిగ్ కార్మికులకు చట్టబద్ధ గుర్తింపు, సంక్షేమ బోర్డు, సంక్షేమ నిధి, సామాజిక భద్రత కల్పించే ప్రత్యేక చట్టం.
37. వృద్ధ తల్లిదండ్రులు నిరాదరణకు గురికాకుండా కుటుంబ బాధ్యతను బలోపేతం చేసే ప్రత్యేక చట్టం.
38. ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షను అరికట్టేందుకు రోహిత్ వేముల తెలంగాణ బిల్లుకు రూపకల్పన.
39. పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి పురోగతి.
40. ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ లక్ష్యంతో 105 స్కూళ్ల మంజూరు.
41. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 84కు అనుమతులు ఇచ్చి నిర్మాణ ప్రక్రియ వేగవంతం.
42. ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా ప్రీప్రైమరీ తరగతుల ప్రారంభం.
43. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లతో ప్రభుత్వ విద్యకు కొత్త నమూనా.
44. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు 22 లక్షలకుపైగా విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం; రూ.720 కోట్ల కేటాయింపు.
45. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం.
46. సంక్షేమ హాస్టళ్లలో డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలు 212 శాతం పెంపు.
47. మెగా డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల నియామకం.
48. దాదాపు 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్.
49. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను యాజమాన్యాల ప్రమేయం లేకుండా నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం.
50. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1,000 కోట్ల కేటాయింపు.
51. ప్రజా ప్రభుత్వ హయాంలో 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు.



52. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, డీఎస్సీ సహా కీలక నియామక ప్రక్రియల పూర్తి.
53. టీజీపీఎస్సీ ద్వారా మరో 456 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు.
54. పోలీసు నియామక బోర్డు ద్వారా 7,437 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు.
55. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు.
56. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో 1,190 మంది అధునాతన నైపుణ్య శిక్షణ పూర్తి; 838 మందికి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు.
57. 65 ప్రభుత్వ ఐటీఐలు, 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దడం.
58. టీహబ్, టీవర్క్స్, టాస్క్, వీహబ్ ద్వారా 90 వేలకుపైగా యువతకు నైపుణ్య శిక్షణ.
59. డీట్ జాబ్స్ ప్లాట్‌ఫాంలో 1.43 లక్షల మంది ఉద్యోగార్థుల నమోదు.
60. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో జాబ్‌మేళాల ద్వారా 40 వేల మంది యువత నమోదు; 5,700 నియామక పత్రాలు.
61. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు.
62. గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌తో క్రీడా మౌలిక సదుపాయాల విస్తరణ.
63. రాజీవ్ ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు.
64. గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో 2,000 పడకల నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం.
65. సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం. అల్వాల్, ఎల్బీనగర్‌లో టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటు.
66. తొమ్మిది కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రారంభం; మరో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం.
67. నిమ్స్‌లో 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల మైలురాయి; దాదాపు 1,900 మందికి ఉచిత చికిత్స.
68. ప్రభుత్వ వైద్యరంగంలో దక్షిణ భారత తొలి రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ నిమ్స్‌లో నిర్వహణ.
69. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5,18,186 మందికి రూ.2,526.12 కోట్ల సహాయం.
70. సీఎంఆర్ఎఫ్ వైద్య రీయింబర్స్‌మెంట్ ద్వారా 4,78,789 మంది పేద రోగులకు రూ.1,635.34 కోట్ల సహాయం; 39,712 మందికి రూ.798.41 కోట్ల ఎల్ఓసీలు.
71. వివిధ విపత్తులు, ఆపద పరిస్థితుల్లో చిక్కుకున్న 225 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.92.37 కోట్ల ప్రత్యేక సాయం.
72. ఆహార కల్తీ, డ్రగ్స్ ముప్పును సమగ్రంగా ఎదుర్కొనేందుకు కొత్తగా టీ సేఫ్ ఏర్పాటు.
73. ఆహార కల్తీ నియంత్రణ, డ్రగ్స్ నియంత్రణను ఒకే వ్యవస్థ కిందకు తీసుకొచ్చి విస్తృత తనిఖీలు, దాడులు నిర్వహించేలా టీ సేఫ్‌కు ప్రత్యేక అధికారాలు.
74. టీ సేఫ్‌కు ప్రత్యేక లీగల్, ల్యాబొరేటరీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఏర్పాటు; కల్తీదారులు, డ్రగ్స్ నేరస్థులపై కఠిన చర్యలకు సమగ్ర వ్యవస్థ.
75. మాదకద్రవ్యాలపై ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థ ఏర్పాటు చేసి డ్రగ్ నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు.
76. పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో యాంటీ డ్రగ్ అండ్ సేఫ్టీ కమిటీలను తప్పనిసరి చేసే నిర్ణయం.
77. విద్యాసంస్థల్లో క్యాంపస్ కోఆర్డినేటర్లు, స్పాటర్లను నియమించి విద్యార్థుల్లో ప్రవర్తనా మార్పులను ముందుగానే గుర్తించే వ్యవస్థ.
78. డ్రగ్స్ నియంత్రణలో బాధ్యత వహించని విద్యాసంస్థల గుర్తింపుపై చర్యలు తీసుకునే విధానం.
79. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక పోలీసింగ్, 1930 స్పందన వ్యవస్థ బలోపేతం.
80. షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లతో మహిళలు, పిల్లల భద్రతకు ప్రత్యేక చర్యలు.
81. భరోసా ప్రాజెక్టు ద్వారా బాలల అనుకూల న్యాయస్థానాల ఏర్పాటులో తెలంగాణ ముందడుగు.
82. పట్టణ ట్రాఫిక్ రద్దీ, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కొత్తగా టీజీ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు.
83. హైవేలు, ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రత్యేక పెట్రోలింగ్, ప్రమాదాల నివారణకు కొత్త వ్యవస్థ.
84. భూ భారతి చట్టంతో భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలు.
85. భూధార్ ద్వారా భూములకు ప్రత్యేక గుర్తింపు, ఏఐ ఆధారిత భూమిత్ర సేవల ప్రారంభం.
86. 3.76 లక్షల కొత్త పట్టాదార్ పాస్‌బుక్స్ జారీ.
87. ప్రజాపాలన-అభయహస్తం ద్వారా గ్రామాలు, వార్డుల్లోనే ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ.
88. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో 12,758 గ్రామసభలు, 3,175 వార్డుసభల నిర్వహణ.
89. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో 1,06,598 పెండింగ్ ప్రభుత్వ ఫైళ్ల పరిష్కారం.
90. అదే కార్యక్రమంలో 76 వేలకుపైగా రైతులను సూక్ష్మ సాగునీటి పరిధిలోకి తీసుకురావడం.
91. 8 వేల ఇంటిగ్రేటెడ్ మహిళా శక్తి భవనాలకు శ్రీకారం.
92. రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి తర్వాత అన్ని ఎంపీడీవో కార్యాలయాలకు మండల ప్రజావాణి విస్తరణ.
93. ప్రతి సోమవారం మండల స్థాయి అధికారులందరినీ ఒకేచోట ప్రజలకు అందుబాటులో ఉంచే మండల ప్రజావాణి వ్యవస్థ.
94. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా అర్జీలు నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్ ప్రజావాణి పోర్టల్ ఏర్పాటు నిర్ణయం.
95. ప్రజావాణి అర్జీల పరిష్కార పురోగతిని ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షించేందుకు ప్రత్యేక డాష్‌బోర్డు ఏర్పాటు నిర్ణయం.
96. ప్రభుత్వ, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా ఆర్థిక క్రమశిక్షణ.
97. కొన్నేళ్లుగా పేరుకుపోయిన రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల్లో వంద రోజుల్లో రూ.6,000 కోట్ల చెల్లింపు.
98. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంప్లాయీ హెల్త్ స్కీమ్ ద్వారా క్యాష్‌లెస్ వైద్య సేవలు.
99. 36 సచివాలయ శాఖల్లో 100 శాతం ఈఆఫీస్ అమలు.
100. దేశంలో తొలి పూర్తిస్థాయి డిజిటల్ కేబినెట్ నిర్వహణ.
101. వాట్సాప్ ద్వారా 581కిపైగా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం.
102. దేశంలో తొలి స్టేట్ ఏఐ డేటా ఎక్స్ఛేంజ్ -టీజీ డెక్స్ ఏర్పాటు; 21 రంగాల్లో 52 ఏఐ ప్రాజెక్టులకు మద్దతు.
103. టీఫైబర్ ద్వారా భారత్‌నెట్ రెండో దశలో 8,895 గ్రామ పంచాయతీలకు డిజిటల్ కనెక్టివిటీ.
104. ప్రభుత్వ ఆదాయ లీకేజీలను అరికట్టేందుకు విజిలెన్స్, పౌరసరఫరాల శాఖల్లో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఏర్పాటు.
105. పౌరసరఫరాలు, మైన్స్ అండ్ మినరల్స్, జీఎస్టీ తదితర రంగాల్లో ఆదాయ నష్టాలు, ఎగవేతలపై ప్రత్యేక నిఘా.
106. హైదరాబాద్ చుట్టూ దాదాపు 360 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు.
107. రాష్ట్రవ్యాప్తంగా 6,092 కిలోమీటర్ల హ్యామ్ రోడ్ల అభివృద్ధి.
108. హైదరాబాద్ మెట్రో రెండో దశలో ఏడు కారిడార్లతో 122.9 కిలోమీటర్ల విస్తరణ ప్రణాళిక.
109. హైదరాబాద్ చుట్టూ రేడియల్ రోడ్ల విస్తరణ.
110. మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ.
111. ఆదిలాబాద్‌లో జాయింట్ యూజ్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధి.
112. హైడ్రా ద్వారా చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ; 1,045 ఎకరాల భూముల స్వాధీనం, దాదాపు రూ.60 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ.
113. బతుకమ్మకుంట, నల్లచెరువు సహా పలు చెరువుల పునరుద్ధరణ.
114. మూసీ పునరుజ్జీవనానికి 55 కిలోమీటర్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక.
115. మూసీ పరిధిలో 39 కొత్త ఎస్టీపీల నిర్మాణం.
116. గోదావరి నుంచి 2.5 టీఎంసీల స్వచ్ఛమైన నీటిని మూసీకి తరలించే ప్రణాళిక.
117. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ-2025 ద్వారా పాత పారిశ్రామిక ప్రాంతాల పునర్వ్యవస్థీకరణ.
118. బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్-2024లో కీలక విభాగాల్లో తెలంగాణ టాప్ అచీవర్.
119. టీజీఐపాస్ ద్వారా 26,608 యూనిట్లకు రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదాలు.
120. టీజీఐఐసీ భూముల్లో రూ.92,281 కోట్ల పెట్టుబడులు; 78 వేలకుపైగా ఉద్యోగ అవకాశాలకు మార్గం.
121. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో 100 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు.
122. హైదరాబాద్‌లో సాఫ్రాన్-సీఎఫ్ఎం విమాన ఇంజిన్ నిర్వహణ, మరమ్మతు కేంద్రానికి మార్గం.
123. నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ-202630; రూ.73,360 కోట్ల పెట్టుబడులు, 3.5 లక్షల ఉద్యోగ అవకాశాల లక్ష్యం.
124. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి కొత్త విధానం.
125. రూ.2,060 కోట్ల యూనిటీ మాల్ నిర్మాణ ప్రణాళిక.
126. రూ.2,049 కోట్ల మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్ అభివృద్ధి.
127. 202627లో ఇప్పటివరకు రూ.12,350 కోట్ల ఎలక్ట్రానిక్స్ పెట్టుబడులు.
128. సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్‌కు ప్రత్యేక ప్రోత్సాహం.
129. ఫోటానిక్స్ వ్యాలీలో రూ.5,500 కోట్ల పెట్టుబడి పైప్‌లైన్.
130. 202526లో తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరిక; ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు 12.14 లక్షలు.
131. హైదరాబాద్‌లో 355కిపైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు; 2026లోనే మరో 40 కొత్త కేంద్రాలు హైదరాబాద్‌ను ఎంచుకోవడం.
132. డేటా సెంటర్లు, క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో దేశంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన కేంద్రంగా తెలంగాణ.
133. అమెజాన్ నుంచి తెలంగాణకు అదనంగా 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి.
134. భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వెల్లి ప్రాంతాల్లో భారీ హైపర్‌స్కేల్, ఏఐరెడీ క్లౌడ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి.
135. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి సమగ్ర టూరిజం పాలసీ-2025 అమలు.
136. ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యానికి మించి తొలి ఏడాదిలోనే రూ.23,174 కోట్ల పెట్టుబడి పైప్‌లైన్; 42 అవగాహన ఒప్పందాలు.
137. యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటులో దేశంలో నంబర్-1గా తెలంగాణ.
138. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 202526లో రూ.101.93 కోట్ల ఆదాయం, రూ.13.35 కోట్ల నికర లాభం.
139. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామపంచాయతీ ఆత్మనిర్భర్ పంచాయతీ స్పెషల్ అవార్డులో దేశంలో మొదటి స్థానం; రూ.1 కోటి పురస్కారం.
140. ‘జయ జయహే తెలంగాణ’ గీతానికి అధికారిక గౌరవం.
141. తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ.
142. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి, వారి కుటుంబాలకు సముచిత గౌరవం కల్పించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు.
143. తెలంగాణ రైజింగ్-2047 కింద 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యం.
144. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యం.
145. క్యూర్-కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, ప్యూర్-పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, రేర్-రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ అనే మూడు అభివృద్ధి వలయాలతో రాష్ట్ర సమగ్ర ప్రణాళిక.
146. భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్ జీరో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసే నిర్ణయం.
147. భారత్ ఫ్యూచర్ సిటీలో ఏఐ సిటీ, డేటా సెంటర్లు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రపంచస్థాయి కేంద్రం ఏర్పాటు.

# వాణీ కపూర్ స్టైలిష్ లుక్

బాలీవుడ్ నటి వాణీ కపూర్ మరోసారి తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. సంప్రదాయ వస్త్రధారణలోని అందాన్ని ఆధునిక ఫ్యాషన్ శైలితో మేళవించిన ప్రత్యేకమైన హైఫ్యాషన్ దుస్తుల్లో ఆమె మెరిసింది. వాణీ ధరించిన ఆలివ్‌గోల్డ్ రంగు ప్లీటెడ్ గౌన్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హార్ట్ షేప్ బాడీస్‌తో రూపొందించిన ఈ గౌన్‌కు అసమానంగా డిజైన్ చేసిన లేస్ అంచుల షోల్డర్ ర్యాప్‌ను జోడించారు. దీంతో సంప్రదాయ డ్రేప్ శైలిని గుర్తుచేస్తూనే, పూర్తిగా ఆధునికమైన ఫ్యాషన్ లుక్‌ను ఆమె సొంతం చేసుకుంది.

వాణీ ఈ దుస్తులను ఎంతో హుందాగా క్యారీ చేసింది. ముఖ్యంగా ఆమె ఎంచుకున్న హెయిర్‌స్టైల్ మొత్తం లుక్‌కు మరింత క్లాసిక్ టచ్‌ను తీసుకొచ్చింది. జుట్టును చక్కగా లో బన్‌గా స్టైల్ చేసుకోవడంతో ఆమె ముఖ సౌందర్యం మరింత స్పష్టంగా కనిపించింది. అలాగే వెచ్చని మెటాలిక్ షేడ్స్‌తో చేసిన ఐ మేకప్ ఆమె కళ్లకు ప్రత్యేకమైన ఆకర్షణను తీసుకొచ్చింది. గోల్డ్ జ్యువెలరీని జోడించడంతో మొత్తం లుక్ మరింత రిచ్‌గా కనిపించింది.

సింపుల్ టచ్‌లతోనే గ్లామర్‌ను హైలైట్ చేయడం వాణీ లుక్‌లో ప్రత్యేకంగా కనిపించింది. దుస్తులు, మేకప్, హెయిర్‌స్టైల్, ఆభరణాల మధ్య మంచి సమన్వయం కనిపించడంతో ఆమె స్టైల్ మరింత ఆకట్టుకునేలా మారింది. తన పొడవైన ఆకృతికి సరిపోయేలా డిజైన్ చేసిన ఈ గౌన్‌లో వాణీ ఎంతో స్టైలిష్‌గా, కాన్ఫిడెంట్‌గా కనిపించింది. ఫ్యాషన్ ఫొటోషూట్‌లో ఆమె ఇచ్చిన పోజులు కూడా అభిమానులను ఆకట్టుకునేలా ఉన్నాయి.

వాణీ కపూర్ కేవలం ఫ్యాషన్ ప్రపంచంలోనే కాకుండా నటిగానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టినప్పటి నుంచి విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ తన నటనా సామర్థ్యాన్ని నిరూపించుకుంటోంది. కమర్షియల్ సినిమాలతో పాటు విభిన్నమైన కథాంశాలు ఉన్న చిత్రాల్లోనూ నటిస్తూ ప్రేక్షకులకు దగ్గరైంది.

‘వార్’ వంటి భారీ యాక్షన్ చిత్రంలో నటించడం ద్వారా వాణీకి మరింత గుర్తింపు వచ్చింది. అనంతరం ‘చండీగఢ్ కరే ఆశికీ’ వంటి విభిన్నమైన కథాంశంతో తెరకెక్కిన సినిమాలోనూ తన నటనతో ఆకట్టుకుంది. కమర్షియల్ హీరోయిన్ ఇమేజ్‌కు మాత్రమే పరిమితం కాకుండా విభిన్నమైన పాత్రలు చేయాలనే ఆసక్తిని ఈ సినిమాల ద్వారా చూపించింది.

ఇటీవల ‘ఖేల్ ఖేల్ మేన్’ చిత్రంలోనూ వాణీ కనిపించింది. కామెడీ, డ్రామా అంశాలతో రూపొందిన ఈ సినిమాలోని నటీనటుల బృందంలో ఆమె భాగమైంది. ఆ తర్వాత ‘రైడ్ 2’ వంటి క్రైమ్ డ్రామాలో నటించింది. విభిన్న జానర్లలో సినిమాలు చేస్తూ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది.

‘అబీర్ గులాల్’ వంటి రొమాంటిక్ చిత్రంతోనూ వాణీ ప్రేక్షకులను పలకరించింది. దీంతో ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా విభిన్నమైన కథలను ఎంచుకుంటున్న నటిగా ఆమెకు గుర్తింపు పెరుగుతోంది. రాబోయే రోజుల్లో ‘బద్తమీజ్ గిల్’, ‘సర్వగుణ సంపన్న’ వంటి ప్రాజెక్టులతోనూ ఆమె ప్రేక్షకుల ముందుకు రానుంది.

వాణీ కపూర్ కెరీర్‌ను పరిశీలిస్తే నటనతో పాటు ఫ్యాషన్ విషయంలోనూ ఆమె ప్రత్యేకమైన శైలిని ఏర్పరుచుకున్నట్లు కనిపిస్తోంది. సినిమా ప్రమోషన్లు, ఫ్యాషన్ ఈవెంట్లు, రెడ్ కార్పెట్ కార్యక్రమాల్లో ఆమె ఎంచుకునే దుస్తులు తరచూ చర్చనీయాంశంగా మారుతున్నాయి. సంప్రదాయ అందాన్ని ఆధునిక డిజైన్లతో కలిపి తనదైన శైలిని ప్రదర్శించడం ఆమెకు ప్రత్యేక ఆకర్షణగా మారింది.

తాజాగా ఆలివ్‌గోల్డ్ గౌన్‌లో కనిపించిన లుక్ కూడా ఇదే విషయాన్ని మరోసారి రుజువు చేసింది.

హుందాతనం, గ్లామర్, ఆధునికత కలగలిపిన ఈ లుక్‌లో వాణీ ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. దీంతో ఆమె తాజా ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఒకవైపు వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు తన ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తోనూ వార్తల్లో నిలుస్తోంది.

నటనలో విభిన్నతను చూపిస్తూ, ఫ్యాషన్‌లో తనదైన ముద్ర వేస్తున్న వాణీ కపూర్ ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆసక్తికరమైన కెరీర్‌ను కొనసాగిస్తోంది. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్న ఆమె నుంచి రాబోయే సినిమాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.





# ఆనంద్ ఆసక్తికర వ్యాఖ్యలు

టాలీవుడ్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయని నటుడు ఆనంద్ దేవరకొండ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులు మళ్లీ థియేటర్లకు వచ్చి సినిమాలను ఆసక్తిగా చూడటం సినీ పరిశ్రమకు మంచి పరిణామమని అన్నారు. వరుసగా విభిన్నమైన కథలు, మంచి కంటెంట్‌తో సినిమాలు విడుదలవుతుండటంతో ప్రేక్షకుల్లో కూడా సినిమాలపై ఆసక్తి పెరుగుతోందని పేర్కొన్నారు. ఇటీవల ‘విశ్వనాథ్ అండ్ సన్స్’, ‘చెన్నై లవ్ స్టోరీ’, ‘ఇరుముడి’ వంటి భిన్నమైన నేపథ్యాలు, జానర్లతో వచ్చిన చిత్రాలకు ప్రేక్షకుల నుంచి స్పందన లభించడం పట్ల ఆనంద్ సంతోషం వ్యక్తం చేశారు. చిన్న చిత్రం, పెద్ద చిత్రం అనే తేడా లేకుండా మంచి కథతో వచ్చే ప్రతి సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తే పరిశ్రమ మరింత బలపడుతుందని అన్నారు. వారాంతంలో ఏ కొత్త సినిమా విడుదలవుతుందో తెలుసుకునేందుకు ప్రేక్షకులు టికెట్ బుకింగ్ యాప్‌లను పరిశీలిస్తున్న పరిస్థితి రావడం సానుకూల మార్పుకు సంకేతమని చెప్పారు.

సినిమాలో విషయం బాగుంటే ప్రేక్షకులు థియేటర్లకు రావడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారని ఆనంద్ పేర్కొన్నారు. గతంలో కొన్ని సందర్భాల్లో కొత్త సినిమాలపై ప్రేక్షకుల్లో పెద్దగా ఆసక్తి కనిపించలేదని, ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వచ్చిందని అన్నారు. థియేటర్లలో ప్రేక్షకుల సందడి పెరగడం పరిశ్రమకు ఉత్సాహాన్ని ఇస్తోందని, ఈ సానుకూల వాతావరణం కొనసాగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇక తన కుటుంబానికి సంబంధించిన విషయాలను కూడా ఆనంద్ దేవరకొండ పంచుకున్నారు. తన అన్న విజయ్ దేవరకొండ భార్య రష్మికను తాను ఆప్యాయంగా ‘రుషి’ అని పిలుస్తానని చెప్పారు. ఆమె తనకంటే చిన్నది కావడంతో ఆ పేరుతోనే పిలవడం అలవాటైందని తెలిపారు. షూటింగ్ పూర్తయిన తర్వాత ఇంటికి వచ్చినప్పుడు రష్మికకు సినిమాలు, షూటింగ్, పని విషయాల గురించి చర్చించడం పెద్దగా ఇష్టం ఉండదని ఆనంద్ వెల్లడించారు. తాను, విజయ్ మాత్రం తండ్రి ఇంట్లో ఉన్నప్పుడు అప్పుడప్పుడు వృత్తిపరమైన విషయాల గురించి మాట్లాడుకుంటామని చెప్పారు. అయితే రష్మిక మాత్రం ఇంటికి చేరుకున్న తర్వాత పూర్తిగా వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు. పని, వ్యక్తిగత జీవితం రెండింటినీ స్పష్టంగా వేరు చేసుకోవడం రష్మికలోని మంచి లక్షణమని ఆనంద్ అన్నారు. ఇంటికి వచ్చిన తర్వాత ప్రశాంతంగా తన సమయాన్ని గడుపుతూ, వృత్తిపరమైన విషయాలను పక్కన పెట్టే ఆమె తీరు తమకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంలో ఆమె నుంచి తాము చాలా నేర్చుకోవాల్సి ఉందని తెలిపారు. మరోవైపు ఆనంద్ దేవరకొండ నటించిన ‘ఎపిక్’ చిత్రం సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తన గత చిత్రాలతో పోలిస్తే భిన్నమైన అనుభూతిని అందించేలా ఉంటుందని, కథ, పాత్ర విషయంలో కొత్తదనం కనిపిస్తుందని ఆనంద్ వెల్లడించారు. సినిమా విడుదల కోసం తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

# ఐదు నెలల్లో రజినీ సినిమా

సీనియర్ స్టార్ హీరోతో సినిమా చేయాలంటే సాధారణంగా షూటింగ్ పూర్తయ్యేందుకు చాలా సమయం పడుతుంది. ఇక పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించే చిత్రాలకు ఈ వ్యవధి మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే సూపర్‌స్టార్ రజినీకాంత్‌తో సినిమా చేస్తున్న యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు మాత్రం వేగంగా షూటింగ్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కేవలం ఐదు నెలల్లోనే చిత్రీకరణను ముగించి, వచ్చే సంక్రాంతికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ విధానం చూస్తే తక్కువ సమయంలో సినిమాలను పూర్తి చేసి త్వరగా విడుదల చేయడంలో పేరున్న టాలీవుడ్ దర్శకుడు అనిల్ రావిపూడి గుర్తుకు రావడం సహజమే. ఇప్పుడు అదే తరహాలో కోలీవుడ్‌లో అశ్వత్ మారిముత్తు రజినీకాంత్‌తో పనిచేస్తున్నారు. ‘ఓ మై కడవులే’, ‘డ్రాగన్’ వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న అశ్వత్‌కు రజినీకాంత్ స్వయంగా అవకాశం ఇచ్చినట్లు సమాచారం. పలువురు దర్శకుల పేర్లను పరిశీలించిన అనంతరం ‘తలైవర్ 173’ బాధ్యతలను ఆయనకు అప్పగించినట్లు తెలుస్తోంది.ఈ చిత్రానికి ‘ధర్మన్: ది డెడ్లీ డాక్టర్’ అనే టైటిల్‌ను మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. జూన్‌లో షూటింగ్ ప్రారంభమైన ఈ సినిమాలో సిమ్రాన్, రాశి ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. రామ్ పోతినేని కీలక పాత్రలో కనిపించనున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను కమల్ హాసన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తికాగా, ప్రస్తుతం రెండో షెడ్యూల్ చిత్రీకరణ కొనసాగుతున్నట్లు సమాచారం. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అశ్వత్ మారిముత్తు తన సినిమాకు సంబంధించిన పలు విషయాలను వెల్లడించారు. రజినీకాంత్‌తో సినిమా చేయడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పిన ఆయన, ఈ చిత్రాన్ని అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అంటే జూన్‌లో ప్రారంభమైన షూటింగ్‌ను కేవలం ఐదు నెలల్లోనే ముగించేందుకు దర్శకుడు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారన్నమాట. రజినీకాంత్ వంటి సీనియర్ స్టార్‌తో తెరకెక్కుతున్న పాన్ ఇండియా సినిమాను ఇంత తక్కువ సమయంలో పూర్తి చేయాలనే ప్రయత్నం ప్రస్తుతం కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.షూటింగ్ అనుకున్న సమయానికి పూర్తయితే ‘ధర్మన్’ను వచ్చే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రజినీకాంత్ ఇమేజ్‌కు తగ్గట్టుగా భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు అశ్వత్ మారిముత్తు తన తదుపరి ప్రాజెక్ట్‌ను శింబుతో చేయనున్నట్లు సమాచారం. వాస్తవానికి రజినీకాంత్ సినిమాకు ముందే శింబుతో సినిమా చేయాల్సి ఉందట. అయితే శింబు నటిస్తున్న ‘అరసన్’ షూటింగ్ ఆలస్యం కావడంతో అశ్వత్ ముందుగా రజినీకాంత్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ‘దయానగరం’ అనే సినిమాలో అశ్వత్ చిన్న పాత్రలో కనిపించనున్నట్లు కూడా సమాచారం. మొత్తంగా రజినీకాంత్‌తో చేస్తున్న పాన్ ఇండియా చిత్రాన్ని కేవలం ఐదు నెలల్లో పూర్తి చేసి సంక్రాంతికి విడుదల చేయాలనే అశ్వత్ మారిముత్తు ప్రణాళిక ఇప్పుడు కోలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతోంది.



# అరియానా ఆవేదన

బిగ్‌బాస్ ఫేమ్, నటి అరియానా గ్లోరీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. యాంకర్ రవి పాడ్‌కాస్ట్ స్టూడియో ప్రారంభోత్సవానికి హాజరైన ఆమె.. తన గృహప్రవేశం సమయంలో ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. శుభకార్యాల సమయంలో కొందరు హిజ్రాలు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆశీర్వాదం ఇవ్వాలనుకుంటే సంతోషంగా ఇవ్వాలని, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం సరికాదని అన్నారు. తన వ్యాఖ్యలు ఎవరినీ కించపరిచేందుకు కాదని స్పష్టం చేసిన అరియానా.. గౌరవంగా జీవించేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలకు పలువురు నెటిజన్లు మద్దతు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకుంటున్నారు.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034